క్లుప్తంగా

తాగునీటిని వృథా చేయొద్దు



మహిళలతో మాట్లాడుతున్న ఎంపీడీ

యాలాల: వేసవిలో తాగునీటిని వృథా చేయొద్దని యాలాల ఎంపీఓ యాదయ్య మండల ప్రజలకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో తాగునీటి సరఫరా చేసే మోటారు స్టార్టర్ రిపేరు కావడంతో కొత్త స్టార్టరును ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం గ్రామ మహిళలతో ఆయన మాట్లాడారు.. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఉదయం వేళ తాగునీటి కుళాయిల వద్ద నీటిని వృథా చేయకుండా అందరూ పాటించాలన్నారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా సేవలు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న శరత్‌కుమార్‌రెడ్డి

కుల్కచర్ల: రాజకీయాలకు అతీతంగా పేదలకు అండగా ఉంటామని కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముజాహిద్‌పూర్‌కు చెందిన బంటు సుక్కమ్మ ఆకస్మికంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి బాధిత కుటుంబీకుల ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి తమ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నరేష్, శ్రీనివాస్, శివ, శ్రీకాంత్, వెంకటేశ్, కృష్ణ, నర్సింలు, నవీన్, శివకుమార్, రాము, శివ పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పెద్దేముల్: లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో పోలీసుల తనిఖీలు ముమ్మరం చేశారు. కర్ణాటక రాష్ట్ర కుంచారం, సేడెం నుంచి తాండూరు వైపు వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీలు చేస్తున్నారు. రూ.50వేల కంటే ఎక్కువ డబ్బులు తరలిస్తే వాటికి సంబంధించిన పత్రాలు చూయించాలన్నారు. లేకుంటే సీజ్ చేయడం జరుగుతుందని పెద్దేముల్ ఎస్ఐ గిరి వివరించారు. వాహనాల్లో డీజిల్, పెట్రోల్‌తో పాటు ఇతర వస్తువులు తరలించిన తప్పకుండా ఖరీదు చేసిన రషీదులు బిల్లులు ఉండాలన్నారు. అక్రమ మద్యం తరలిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

రాలుతున్న మామిడి



దౌల్తాబాద్‌లోని మామిడితోట

దౌల్తాబాద్: అధిక ఉష్ణోగ్రతలతో మామిడి తోటల్లో మామిడి కాయల రాలిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారుగా 60ఎకరాల్లో మామిడి తోటలు అతి తక్కువగా సాగు చేస్తున్నారు. అయితే, మామిడికాయలకు మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. భూగర్భ జలాలు ఇంకిపోవడంతో చెట్లకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు లేక పండుకాయలు రాలిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

13 నుంచి మల్లికార్జున స్వామి ఉత్సవాలు

యాలాల: మండలంలోని ఎన్కెపల్లి శివారులో వెలసిన మల్లికార్జున స్వామి ఆలయ 32వ వార్షిక మహోత్సవ జాతరోత్సవాలు ఏప్రిల్ 13 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు పూజారి కిష్టప్ప మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13న తెల్లవారు జామున 5 గంటలకు అగ్ని గుండం, రాత్రి 7 గంటలకు పల్లకీ సేవ ఉంటుందని, 14న ఉ.7 గంటలకు నవగ్రహా పూజా, రుద్రాభిషేకం నిర్వహించనున్నారని తెలిపారు. 11.30 గంటలకు భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వార్ల కల్యాణోత్సవం, సా.5 గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేయనున్నారని చెప్పారు.

ఊతమివ్వని ఉపాధి హామీ

పలు కారణాల వల్ల ఉపాధి హామీ పథకం కింద గిట్టుబాటు కూలి దక్కడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారి వ్యవసాయ, ఇతర పనులకు వెళ్తే రూ.600లు డబ్బులు వస్తాయని అంటున్నారు. పథకంలో పనికి తగ్గ వేతనం లేదంటూ ఆరోపిస్తున్నారు. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయడం లేదని, తాగునీటి సౌకర్యం కల్పించడం లేదని కూలీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పనులపై సాక్షి ప్రత్యేక కథనం..

- పని ప్రదేశంలో నీడ కరువు
- తాగునీటికి తప్పని తిప్పలు
- దినసరి కూలి అందక అవస్థలు



పర్సాపూర్‌లో పనిచేస్తున్న కూలీలు

కొడంగల్ : జాతీయ ఉపాధి హామీ పథకంలో దినసరి కూలి గిట్టుబాటు కావడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. మండుటెండలో పనిచేస్తే రోజు వారి కూలి దొరకడం లేదని వాపోతున్నారు. మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో మొత్తం 570 జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో పనిచేసే వారు 260 మంది ఉన్నారు. ప్రస్తుతం వేసవి కాలం .. ప్రతి రోజు 40 నుంచి 50 మంది వరకు పని చేయడానికి వస్తున్నారు. అయితే, మార్చి నెలలో కూలి డబ్బులు చెల్లించడంలో జాప్యం జరుగుతున్నట్లు కూలీలు చెబుతున్నారు. 5 వారాల నుంచి వేతనాలు చెల్లించలేదన్నారు. నేల స్వభావాన్ని బట్టి రోజుకు రూ.170 నుంచి రూ.190 వరకు కూలి డబ్బులు వస్తున్నాయి. చాలీచాలని దినసరి కూలి వల్ల ఉపాధి హామీ ప్రజలు పనికి రావడానికి జంకుతున్నారు. ఇతర పనులకు వెళ్తే రోజుకు రూ.600లకు పైగా డబ్బులు వస్తున్నాయని అంటున్నారు. మండుటెండలో పనులు చేయాలంటే ఇబ్బందిగా ఉంది. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయడం లేదు. తాగునీటి సౌకర్యం కల్పించడం లేదని కూలీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చాలీచాలని కూలితో అవస్థలు



ఉపాధి హామీ పథకంలో రోజు వారి కూలి గిట్టుబాటు కావడం లేదు. రోజుకు రూ.170 నుంచి రూ.190 వరకు కూలి డబ్బులు వస్తున్నాయి. చాలీచాలని డబ్బుల వల్ల ఇబ్బందిగా ఉంది. బయట పనులకు వెళ్తే రోజుకు రూ.600లకు పైగా కూలి వస్తుంది. 5 వారాల నుంచి పైసలు రావడం లేదు. ప్రస్తుతం ఎండాకాలం పనికి పోవాలంటేనే కూలీలు జంకుతున్నారు. – లక్ష్మయ్య, పర్సాపూర్

వృద్ధులకు ఇంటి నుంచే ఓటు సౌకర్యం



అధికారులకు లిస్టు అందజేస్తున్న తహసీల్దార్ కిషన్

తహసీల్దార్ కిషన్

పెద్దేముల్: లోక్‌సభ ఎన్నికల్లో 85 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం ప్రభుత్వం కల్పించిందని తహసీల్దార్ కిషన్ పేర్కొన్నారు. మంగళవారం పెద్దేముల్ ఎంపీడీఓ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. 85 సంవత్సరాలు నిండిన వృద్ధులు, 40శాతం కంటే ఎక్కువ ఉన్న వికలాంగులు, పెన్షన్ వచ్చే ఫిజికల్ హ్యాండ్ క్యాప్స్‌లు గ్రామాల్లో ఎంత మంది ఉన్నారు. వారిని వెంటనే గుర్తించి సమాచారం ఇవ్వాలని బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున త్వరలో సర్వే చేయాలని సూచించారు. సర్వేలో పాల్గొనని అధికారులపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ (ఆర్ఐ) రాజిరెడ్డి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు వేణు, అవినాష్, మల్లేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



5కే రన్‌లో పాల్గొన్న తహసీల్దార్ తదితరులు

పరిగి: ఓటర్లకు అవగాహన కల్పించేందుకు స్వీప్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి మినీ స్టేడియం వరకు 5కే రన్ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌రావు మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి నిత్యం వ్యాయమాలు చేయాలన్నారు. ఆరోగ్యం బాగుంటే కోట్లు సంపాదించి నట్లేనని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిదని ఓటుతో పరిపాలనను ఎంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నవీన్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా



రంజాన్ తోఫాను అందజేస్తున్న ప్రతినిధులు

తాండూరు: రంజాన్ పండగ సందర్భంగా తాండూరు పట్టణంలో ఏఎస్ఎంజీకే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. పాత తాండూరులోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో ఏఎస్ఎంజీకే ట్రస్ట్ చైర్మన్ ముజీబ్ ఖాన్ ఆదేశాల మేరకు సంస్థ ప్రతినిధులు రంజాన్ తోఫాను 200 మంది విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కలీం మాట్లాడుతూ.. పేదల కుటుంబాల్లో వెలుగు నింపేందుకే ట్రస్ట్ సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఎలప్పుడు ప్రజల మధ్యలో ఉంటూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కుల మతాలకతీతంగా సంస్థ ద్వారా చేయూత అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ట్రస్ట్ ప్రతినిధులు తదితరులున్నారు.

పీఆర్సీ చైర్మన్‌ను కలిసిన టీపీఎస్ఎఫ్ బృందం



పీఆర్‌సీ చైర్మన్‌ను కలిసిన టీపీఎస్ఎఫ్ ప్రతినిధి బృందం

అనంతగిరి: పీఆర్సీ చైర్మన్ రిటైర్డు ఐఏఎస్ శివశంకర్‌ను మంగళవారం తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్(టీపీఎస్ఎఫ్)తరఫున సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్, పలు జిల్లాల అధ్యక్షులతో కలిశారు. ఈ సందర్భంగా గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులకు సీనియర్ అసిస్టెంట్‌లకు పే స్కేల్ ఇవ్వాలని కోరడంతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా నెలవారి ఫిక్స్‌డ్ ట్రావెల్ అలవెన్స్ సదుపాయం కలిపించాలని కోరామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవిశెట్టి తెలిపారు. కార్యక్రమంలో పలువురు రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో వేగం పెంచండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీఓ విజయ్‌కుమార్, పూజ

ఎంపీఓ విజయ్‌కుమార్

బంట్వారం: ఇంటి పన్నుల వసూళ్ల వందశాతం పూర్తి చేయాలని ఎంపీఓ విజయ్‌కుమార్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామాన్ని సందర్శించి గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శి పూజకు పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్యం పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. వేసవి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పన్నులు ప్రతి ఒక్కరు చెల్లించి, అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే స్పెషల్ ఆఫీసర్ లేదా పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పూజా గ్రామస్తులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయండి



రేవంత్‌రెడ్డిని కలిసిన నాగప్ప, ఎమ్మెల్యేలు తదితరులు

తాండూరు రూరల్: సీఎం రేవంత్‌రెడ్డిని తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెన్నె నాగప్ప కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో చేవెళ్ల పార్లమెంట్‌కు సంబంధించి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేకంగా నాగప్పను తీసుకెళ్లి సీఎం రేవంత్‌రెడ్డికి పరిచయం చేశారు. ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని సీఎం కోరారు. మండల ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, యూత్ అధ్యక్షుడు జగదీశ్‌లు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన చేవెళ్ల నాయకులు

చేవెళ్ల: సీఎం రేవంత్‌రెడ్డిని చేవెళ్లకు పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి కె.మహేందర్‌గౌడ్‌లు కలిశారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశానికి వెళ్లినవారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందామని ఆయన ఈ సందర్భంగా సూచించారు. పార్టీని గెలిపిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని సీఎం చెప్పారన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ రాములు తదితరులు

ప్రత్యేక అవసరాల పిల్లలకు చేయూత

కొడంగల్ : ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు హైదరాబాద్‌కు చెందిన ఓ ఆస్పత్రి వారు అండగా నిలిచారు. పట్టణంలోని కేఎస్‌పీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచితంగా వీల్‌చైర్లు, వాకర్లు, బీపీ గ్లూకో మీటర్లు, హెల్మెట్లు, బెడ్లు, వాకింగ్ స్టిక్స్, మెడిసిన్ టేబుల్స్, ఫుట్ స్టాండ్స్ ఇతర వైద్య సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. తాము లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఎంతో మంది పేదలకు కంటిచూపును కల్పించినట్లు చెప్పారు.



పరికరాలు పంపిణీ చేస్తున్న గురునాథ్‌రెడ్డి

కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థచారి, సామాజిక కార్యకర్త మురహరి వశిష్ట, కో ఆప్షన్ సభ్యుడు మునీర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా కాషాయ జెండా ఎగురవేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పూడూరు: కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి చేవెళ్లపై కాషాయ జెండా ఎగురవేద్దామని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మన్నేగూడలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇక్కడే పుట్టి పెరిగిన తనకు ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాలు తెలుసునని.. ఎక్కడి నుంచో వచ్చిన రంజిత్‌రెడ్డికి ఈ ప్రాంతం గురించి ఏమీ తెలియదన్నారు. ప్రస్తుతం ఉన్న ఎంపీ రంజిత్‌రెడ్డి ఒక్కసారైనా గ్రామాలకు వచ్చారాని ప్రశ్నించారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. ప్రస్తుతం బీజేపీకి అనుకూల వాతావరణం ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీపై ఉన్న కోపంతో కాంగ్రెస్‌కు ఓట్లు పడ్డాయని చెప్పారు. చేవెళ్ల ఎంపీ ఎన్నికల్లో బీజేపీ నుంచి బరిలో ఉన్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, సెన్సార్ బోర్డు మెంబర్ మల్లేష్‌పటేల్, మండల పార్టీ అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య, రవీందర్, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాంరెడ్డి

నవాబుపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆ సంఘం చైర్మన్ పోలీస్ రాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం లావాదేవీలు, అప్పులు, రుణాలు, తదితర అంశాలపై సభలో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చాలా మంది రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. దీంతో సంఘం దివాలా తీసే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పంట రుణాలు, ఎల్‌టీ రుణాలు అడిగిన రైతులకు ఇవ్వడం జరుతుందన్నారు. బంగారంపై కూడా రుణాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు విఠల్‌రెడ్డి, మల్‌రెడ్డి, మాణయ్య, ప్రభు, సీఈఓ మోమన్‌రెడ్డి, రైతులు , సిబ్బంది, తదితరులున్నారు.

ఉపాధికూలీలు జాగ్రత్తగా ఉండాలి



ఉపాధి కూలీలకు సూచనలు చేస్తున్న కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

కుల్కచర్ల: ఎండలు ఎక్కువ ఉన్న నేపథ్యంలో ఉపాధిహామీ పనులు చేసే కూలీలు జాగ్రత్తలు తీసుకొని పనులు చేయాలని కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కుల్కచర్ల గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు చేశారు. తలపై టోపీలు లేదా టవాలు వేసుకుని పనిచేయాలని, నీరు ఎక్కువగా తాగాలి, విరామ సమయంలో నీడలో కూర్చోవాలని సూచించారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఉపాధిపనులను రావద్దని, ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రిసార్ట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

మొయినాబాద్: ఎలాంటి అనుమతులు లేకుండా 111 జీఓ పరిధిలో అక్రమంగా విల్లాల నిర్మాణం చేపడుతున్న డ్రీమ్‌వ్యాలీ రిసార్ట్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలపై మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మండలంలోని బాకారం రెవెన్యూ సర్వే నంబర్ 72లో డ్రీమ్‌వ్యాలీ రిసార్ట్ యాజమాన్యం అక్రమంగా విల్లాలు నిర్మిస్తోంది. 111 జీఓ అమలులో ఉన్న ఈ ప్రాంతంలో హెచ్ఎండీఏ అనుమతి లేకుండా విల్లాలు నిర్మిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలు చేపడుతూ చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న యాజమాన్యంపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, శివ, అంజయ్య పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- ఇష్టారాజ్యంగా మెడికల్ దుకాణదారులు
- ఫార్మసిస్టులు లేకుండా మందుల విక్రయాలు
- మెడికల్ యజమానులపై చర్యలు శూన్యం
- పట్టించుకోని అధికారులు

పరిగి: మెడికల్ దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నియోజకవర్గంలో వందకు పైగా మెడికల్ దుకాణాలు కొనసాగుతున్నాయి. నిబంధనల ప్రకారం మెడికల్ దుకాణాల్లో ఫార్మసిస్టుల సమక్షంలోనే మందులను విక్రయించాలి. కానీ కొన్ని షాపుల్లో ఫార్మసిస్టులు లేకుండా మందులు విక్రయించి ప్రజలు ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు.

చీటి లేకుండానే విక్రయాలు

వైద్యులు రాసిన మందుల చీటి ఉంటేనే రోగులకు మందులు ఇవ్వాలి. కాని కొన్ని మెడికల్ దుకాణాల్లో మందుల చీటి లేకుండానే విక్రయిస్తున్నారు. మందులను విక్రయించినప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాల్సి ఉండగా ఎవరూ రసీదుల ఇవ్వడం లేదు. నియోజకవర్గంలో చాలా మందుల దుకాణాల్లో కాలం చెల్లిన మందులతో పాటు ప్రభుత్వ అనుమతులు లేని మందులను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల పరిగి నియోజకవర్గంలోని దోమ మండల కేంద్రంలో ఆర్ఎంపీ డాక్టర్ బాలికకు చికిత్స చేయగా మెడికల్ దుకాణదారుడు కాలం చెల్లిన మందులు విక్రయించడంతో రోగి(బాలిక) అస్వస్థతకు గురై మృతి చెందడంతో డాక్టర్‌పై, మెడికల్ దుకాణ యాజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసి, మెడికల్ దుకాణాన్ని తనిఖీ చేశారు.



దోమ మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

నిషేధిత మందుల విక్రయం..

పరిగి పట్టణ కేంద్రంతో పాటు దోమ, కుల్కచర్ల, పూడూర్ తదితర గ్రామాల్లోని మెడికల్ దుకాణాల్లో ప్రభుత్వం నిషేధించిన మందులను మెడికల్ దుకాణ దారులు దర్జాగా అమ్ముతున్నారు. మెడికల్ దుకాణాలను తనిఖీ చేయాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రోగులకు మెడికల్ దుకాణదారులు ఇచ్చిన మందులు వాడటంతో ఆరోగ్యం మరింత క్షీణిస్తుంది. ప్రజా ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం కొన్ని రకాల మందులను నిషేధించింది. అయితే, ఆ మందులను వాడటం వల్ల ప్రజలకు మునుముందు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని గ్రహించి అనేక రకాల మందులను ప్రభుత్వం బ్యాన్ చేసింది. కాని మెడికల్ దుకాణదారులు కాసులకు కక్కుర్తి పడి ప్రజల ఆరోగ్యాలను పాడుచేస్తున్నారు. ఒకే ఫార్ములా అని పేర్లు చెప్పి రోగులకు విక్రయిస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మెడికల్ దుకాణదారులు నాసిరక మందులు, కాలంచెల్లిన మందులు, ప్రభుత్వం నిషేధించిన కొన్ని రకాల మందులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం..

మెడికల్ దుకాణాలను తనిఖీలు చేసి నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం. మెడికల్ దుకాణాల్లో ఫార్మసిస్టు ద్వారానే మందులను విక్రయించాలి. ఫార్మసిస్టులు లేకుండా మందులను విక్రయిస్తే వారిపై చట్టరమైన చర్యలు తీసుకుంటాం. కాలం చెల్లిన మాత్రలను విక్రయించరాదు.
–క్రాంతికుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వికారాబాద్ జిల్లా